www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -300 గురువారం 5 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01
Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మున్సిపల్ ఎన్నికల తరవాత
# రైతుభరోసా



### మిర్యాలగూడ ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి**
**సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి**
**రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం**
**తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్**
**తెలంగాణ తల్లి మన సోనియమ్మ**



మిర్యాలగూడ,**ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మిగతా 2లో...

## ముస్లింల ఓట్ల కోసం
# కాంగ్రెస్ ఆరాటం



**ఎస్సీఎస్టీ నిధులు మైనార్టీలకు బదలాయింపు**
**ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సిఎం రేవంత్**
**మహబూబ్‌నగర్ ప్రచారంలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్**

మహబూబ్‌నగర్,**ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని మిగతా 2లో...

## జిమ్‌ల ముసుగులో
# యువతులకు వల

**అన్ని రాష్ట్రాలు, కేంద్రానికి**
**నోటీసులు జారీ చేసిన ఎన్ హెచ్‌ఆర్సీ**
**యూపీలోని మీర్జాపూర్‌లో 50 మందికి పైగా బాధితులని ఫిర్యాదు**
**జిమ్‌ల నిబంధనలపై నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్**



**న్యూఢిల్లీ ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
దేశవ్యాప్తంగా ఉన్న జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల ముసుగులో యువతులపై లైంగిక దోపిడీ, బలవంతపు మతమార్పిడులు జరుగుతున్నాయన్న తీవ్రమైన ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్‌ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదికలుమిగతా 2లో...

# అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు


**ఆవరణలో 8 మంది సస్పెన్షన్ ఎంపీల ఆందోళన-లోక్‌సభలో వాయిదాల పర్వం**
**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఇతర ఎంపీల మద్దతు**



**న్యూఢిల్లీ ఫిబ్రవరి4ప్రజావినికిడి,** ఎప్‌స్టీన్ ఫైల్స్, ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని అంశాలు ఎక్కడ బయటపడతాయో అని కేంద్రం భయపడుతోందని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. బుధవారం ఉభయ సభల ఆరంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని మకర ద్వారం వద్ద సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఎంపీ ఎస్. వెంకటేషన్, కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాణిక్యం ఠాగూర్, ప్రశాంత్ పడోలే, హిబి ఈడెన్, డీన్ కురియకోస్, గుర్జీత్ సింగ్ ఔజ్లా, అమరీందర్ సింగ్ రాజా వారింగ్ పాల్గొన్నారు. ప్రధాని మోడీ, అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ('పీఎం ఈజ్ కాంప్రమైజ్డ్')తో రాజీపడ్డారనిమిగతా 2లో...

## ఎమ్మెల్యే సంజయ్ పార్టీ
# మారినట్టు ఆధారాల్లేవు

### మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



హైదరాబాద్**ఫిబ్రవరి4ప్రజావినికిడి,**బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరినట్టు ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తేల్చారు. సంజయ్ కుమార్‌పై అనర్హత వేటు వేయాలంటూ మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేశారు. పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేకు క్లీన్‌చిట్ ఇచ్చారు. బుధవారం అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో అనర్హత పిటిషన్‌పై స్పీకర్ విచారణ జరిపారు. ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినట్టు తగిన ఆధారాలు లేవంటూ అనర్హత పిటిషన్‌ను కొట్టివేశారు. ఫిరాయింపుల కేసులో ఇప్పటి వరకు ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. మిగతా 2లో...



# న్యాయం ఏడుస్తోంది

**: సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ**
**ఈసీపై సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ పిటిషన్**
**తన పిటిషన్ పై తానే వాదనలు వినిపించిన మమత**
**ఈసీపై తీవ్ర విమర్శలు గుప్పించిన మమత**

**న్యూఢిల్లీ ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం (ఈసీఐ)పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) వోటర్ లిస్ట్‌పై సవాలు చేస్తూ ఆమె దాఖలుమిగతా 2లో...



## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో
# పవన్ ప్రచారం

**పవన్ కల్యాణ్ ను కలిసిన కిషన్ రెడ్డి, రాంచందర్ రావు**
**బీజేపీకి పవన్ మద్దతు ప్రకటించారన్న రాంచందర్ రావు**
**బీజేపీ తరపున ప్రచారం చేయడానికి అంగీకరించారని వెల్లడి**

హైదరాబాద్**ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈనెల 7,8 తేదీల్లో బీజేపీకి మద్దతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బిజెపి నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు.. పవన్ కల్యాణ్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మిగతా 2లో...

# స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు


**కళ్లముందు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేవంటే ఎలా**
**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్‌చిట్‌పై కెటిఆర్ ఆగ్రహం**

హైదరాబాద్,**ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని మిగతా 2లో...




# కొత్త విద్యుత్ కనెక్షన్లలో మార్పులు

**రైతుల నుంచి ఓఆర్‌సీ ఫీజు రద్దు**
**గేటెడ్ కమ్యూనిటీల్లో వ్యక్తిగత మీటర్లకు అనుమతి**
**మ్యాన్‌వల్‌కు స్వస్తి..ఇక నుంచి అన్ని ఆన్‌లైన్లోనే**
**గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



**హైదరాబాద్ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
రాష్ట్రంలో విద్యుత్ కొత్త కనెక్షన్ల జారీలో గురువారం నుంచి భారీ మార్పులు చోటుచేసు కోనున్నాయి. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) జారీ చేసిన కొత్త మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. వినియోగదారుల అభ్యర్థన మేరకు వారికి పారదర్శక సేవలను అందించేం దుకు అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత, విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 181లోని సబ్-సెక్షన్ (1) ప్రకారం సవరణలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ గెజిట్ గురువారం నుంచి అమల్లోకి రానుంది. కొత్త నిబంధనల ప్రకారం కనెక్షన్ల కోసం కరెంట్ ఆఫీసుల చుట్టూ తిరిగే బాద వినియోగదారులకు తప్పనుంది. ఎస్టిమేషన్ల పేరిట కాంట్రాక్టర్లు, అధికారుల అక్రమ దందాకు తెరపడనుంది. మిగతా 2లో...

# న్యాయం ఏడుస్తోంది

(మొదటి పేజి తరువాయి)

చేసిన పిటిషన్‌పై సీజేఐ సూర్యకాంత్ ముందు వాదనలు జరిగాయి. "న్యాయం తలుపుల వెనక ఏడుస్తోంది" అంటూ మమత గట్టిగా అరిచారు. తాను మాట్లాడేందు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని కోరగా సీజేఐ అంగీకరించారు. 15 నిమిషాల పాటు మాట్లాడే అవకాశం ఇచ్చారు.మమత తన వాదన మొదలు పెడుతూనే ఈసీఐపై మాటల దాడి చేశారు. ఆరు సార్లు లేఖలు రాశాను కానీ ఒక్క స్పందన రాలేదని, ఎక్కడా న్యాయం దొరకడం లేదని ఆరోపించారు. భాషా సమస్యలు, స్పెల్లింగ్ మిస్‌మ్యాచ్‌ల వల్ల మాత్రమే వోటర్లను తొలగించకూడదని వాదించారు. వివాహం తర్వాత ఇంటి పేరు మారిన మహిళల పేర్లను తొలగించారని తెలిపారు. ఆధార్‌ను ఆమోదించకపోవడం కోర్టు ఆదేశాల ఉల్లంఘన అని... ఇతర రాష్ట్రాల్లో డొమిసైల్, కుల సర్టిఫికెట్లు అంగీకరిస్తుంటే బెంగాల్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.ఎన్నికల ముందు 3 నెలల్లో ఎందుకు ఇంత హడావుడి? నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉంటే ఎందుకు బెంగాల్‌ను మాత్రమే ఎంచుకున్నారు? అని ప్రశ్నించారు. బూత్ లెవల్ ఆఫీసర్ల మరణాలకు ూ×=తో సంబంధం ఉందని, హార్వెస్టింగ్ సీజన్‌లో 100 మందికి పైగా మరణాలు, హాస్పిటలైజేషన్లు జరిగాయని, అసోంలో ఎందుకు ఇలాంటివి లేవని విమర్శించారు. బెంగాల్‌ను "బుల్డోజ్" చేస్తున్నారని, ప్రజల హక్కులను కాపాడాలని ధర్మాసనాన్ని కోరుతున్నానని అన్నారు.జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, వీఎం పంచోలి బెంచ్ మమతా పిటిషన్ జెన్యూన్ అని అంగీకరించింది. ూ×= నోటీసులు పంపేటప్పుడు అధికారులు కాస్త సెన్సిబుల్‌గా ఉండాలని ఈసీకి సూచించింది. అమర్త్యా సేన్, జాయ్ గోస్వామి, టీఎంసీ ఎంపీ దీపక్ అధికారి వంటి ప్రముఖులకు నోటీసులు పంపడం గురించి ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేసింది.మరోవైపు, మమత కోల్ కతాలోని జోగేశ్ చంద్ర చౌదరి కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టులో సొంతంగా వాదనలు వినిపించడం ఇదే తొలిసారి.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పవన్ ప్రచారం

(మొదటి పేజి తరువాయి)

మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ తరఫున ప్రచారంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, రామచందర్ రావు.. పవన్‌ను కోరారు. ఇందుకు పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని రామచందర్ రావు స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పవన్ కల్యాణ్ గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా, అర్థవంతమైన చర్చలు జరిపాము. పవన్ కల్యాణ్ గారు భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించారు' అని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, జనసేన స్నేహపూర్వక పోటీ అంటూ ఈ మేరకు జనసేన పార్టీ ట్వీట్ చేసింది.

## జిమ్‌ల ముసుగులో యువతులకు వల

(మొదటి పేజి తరువాయి)

ఇవ్వాలని కోరుతూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు, కేంద్ర క్రీడలు-యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ూూ×)కు నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలు నిజమైతే, బాధితుల మానవ హక్కులకు తీవ్ర భంగం వాటిల్లినట్లేనని కమిషన్ అభిప్రాయపడింది.ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఓ జిమ్ కేంద్రంగా భారీ దోపిడీ రాకెట్ పనిచేస్తోందని, యువతులే లక్ష్యంగా ఈ దారుణాలు జరుగుతున్నాయని ఓ ఫిర్యాదుదారుడు ఎన్ హెచ్‌ఆర్సీని ఆశ్రయించారు. మీడియా కథనాల ప్రకారం, ఈ ముఠా వలలో దాదాపు 50 మందికి పైగా యువతులు చిక్కుకున్నారని, ఈ రాకెట్‌లో ఏకంగా ఓ పోలీసు అధికారికి ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు అధికారి ప్రమేయం ఉండటం అధికార దుర్వినియోగానికి, శాంతిభద్రతల వైఫల్యానికి, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడానికి నిదర్శనమని ఫిర్యాదుదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మహిళల భద్రతకు, మత స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని తెలిపారు. ఫిట్‌నెస్ కేంద్రాల ముసుగులో వ్యవస్థీకృత నేర ముఠాలు పనిచేస్తున్నాయనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆరోపించారు.ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని, బాధితులకు రక్షణ కల్పించి పునరావాసం కల్పించాలని, నిందితుడైన పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల కోసం కఠినమైన నియంత్రణ మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఫిర్యాదును ఎన్ హెచ్‌ఆర్సీ సభ్యులు ప్రియాంక్ కనూంగో నేతృత్వంలోని బెంచ్ సుమోటోగా స్వీకరించింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం-1993లోని సెక్షన్ 12 ప్రకారం చర్యలు చేపట్టింది. తమ పరిధిలోని జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు, రిజిస్ట్రేషన్ నిబంధనలు, ప్రమాణాలపై నివేదిక సమర్పించాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. దేశంలో జిమ్‌ల కోసం ఏమైనా జాతీయ విధానాలు ఉన్నాయా అనే వివరాలు ఇవ్వాలని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను, లైసెన్సింగ్ అవసరాలపై సమాచారం ఇవ్వాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌ను కోరింది. ప్రత్యేకంగా మీర్జాపూర్ ఘటనపై లోతైన విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అక్కడి జిల్లా మేజిస్ట్రేట్, ఎస్పీని ఆదేశించింది. సంబంధిత అధికారులు రెండు వారాల్లోగా తమ నివేదికలను సమర్పించాలని స్పష్టం చేసింది.

## అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు

**(మొదటి పేజి తరువాయి)** ప్లకార్డులు, భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. జనరల్ మనోజ్ కుమార్ నరవణె పుస్తకంతో పాటు నరేంద్ర మోడీ ఫొటోను ఆ బ్యానర్‌పై ముద్రించారు. ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ.. ప్రజల కోసం మాట్లాడుతుంటే గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతులు నొక్కాలని చూస్తోందని అన్నారు. కానీ ప్రజాక్షేత్రంలో నిజాలు చెప్పకుండా ఎలా అడ్డుకోగలరని ప్రశ్నించారు. దేశ భవిష్యత్తును మోడీ తాకట్టు పెడుతున్న తీరు, ప్రజలకు కేంద్రం చేస్తున్న అన్యాయం, నష్టాన్ని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బీజేపీ చేసే తప్పులను అంగీకరిస్తేనేడ పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం కల్పిస్తామనేలా ఎన్డీఏ సర్కార్ వ్యవహరిస్తోందన్నారు. దేశ శ్రేయస్సు, భవిష్యత్తు తరాల కోసం మాట్లాడేందుకు సభలో అవకాశం కల్పించకపోవడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ప్రతిపక్ష నేతకే మాట్లాడే అవకాశం ఇవ్వకుంటే, దేశం కోసం ప్రశ్నిస్తే మైక్ కట్ చేస్తుంటే.. ఇక సభలు నిర్వహించుకోవడం ఎందుకని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు.

## కొత్త విద్యుత్ కనెక్షన్లలో మార్పులు

(మొదటి పేజి తరువాయి)

గతంలో విద్యుత్ స్తంభాలు, లైన్ల కోసం వినియోగదారుల నుంచి దూరాన్ని బట్టి ఒక్కో రీతిలో ఫీజు వసూలు చేసేవారు. ఇకపై ఫిక్స్‌డ్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. కొత్త కనెక్షన్ కావాలనుకునే వారు ఇకపై భౌతిక పత్రాలతో అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. సంబంధిత డిస్కం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ కార్డ్, సంబంధిత ఆస్తి తాలుకు రుజువులు వంటి అవసరమైన సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. వినియోగదారుడి దరఖాస్తు ఏ దశలో ఉందో ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు ట్రాక్ చేయవచ్చు. అధికారుల నిర్లక్ష్యం వల్ల జాప్యం జరిగితే ఆటోమేటిక్‌గా ఉన్నతాధికారులకు సమాచారం చేరుతుంది.

## ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినట్టు ఆధారాల్లేవు

ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, కృష్ణమోహన్‌రెడ్డి, టి. ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, తాజాగా సంజయ్ కుమార్‌లకు ఊరట లభించింది. ఇంకా కడియం శ్రీహరి, దానం నాగేందర్ అనర్హతపై విచారణ పెండింగ్‌లోనే ఉంది.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే : సంజయ్ కుమార్**

'నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే. ఆ పార్టీ నుంచే గెలిచా. నా జీతం నుంచి ప్రతి నెలా రూ. 5000 బీఆర్ఎస్ పార్టీకి ఇస్తున్నా. అసెంబ్లీలో బీఆర్ఎస్ బిల్లులు ప్రవేశపెట్టి, విప్ జారీ చేస్తే నేను మద్దతు ఇస్తా. నేనెప్పుడూ బీఆర్ఎస్‌ను, అధిష్టానాన్ని విమర్శించలేదు. స్థానిక నాయకత్వం నాకు దూరంగా ఉంది. నాది అభివృద్ధి కోసమే ఆరాటం. నాతో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా ఇండిపెండెంట్ అభ్యర్థుల కోసం ప్రచారం చేస్తా. జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్న. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా, జగిత్యాల అభివృద్ధికి మద్దతుగా ఉన్న అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించండి. జగిత్యాల పట్టణాన్ని ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తా అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల తరవాత రైతుభరోసా



(మొదటి పేజి తరువాయి)

'ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బ్జడెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్దిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బిఆర్ఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం డిమాండ్ ఉందని, రాబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రజలపై కోపంతో ÷ూఒఃఅ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ÷ూఒఃఅ ప్రమాదంలో 8 మంది మృతి చెందితే మామ?అల్లుళ్ల సంబరాలు చేసుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. గంజి గతి లేని నాయకులు బెంజ్ కార్లు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మిగితా నేతలు డబ్బులు ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని పిలుపునిచ్చారు.గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీఎం ఆరోపిస్తూ.. జాతిపిత ఎవరన్న ప్రశ్నకు సమాధానంగా, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌నే జాతిపిత అని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీనే తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు. రెండేళ్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సీఎం పిలుపునిచ్చారు. మరో ఎనిమిదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ, 'కాంగ్రెస్ గెలిస్తే పేదవారు గెలుస్తారు' అని సీఎం అన్నారు.



# ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

(మొదటి పేజి తరువాయి)

గుర్తు చేశారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు

ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని నితిన్ నబీబ్ విమర్శించారు.

నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్‌ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే భాజపాను గెలిపించాలి.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజులు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని చూస్తే.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు నితిన్ నబీన్ సూచించారు. తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో రైల్వేకు రూ.5,400 కోట్లకుపైగా కేటాయించింది. తెలంగాణకు



మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు కేటాయించింది. రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోంది. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తోంది. కొన్నివర్గాలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత పెడుతోంది. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తోంది. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపట్లేదు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములు ఆక్రమిస్తున్నారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించం' అని నితిన్ నబీబ్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే కాదు.. బీఆర్ఎస్ పాలనలో సైతం పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని.. చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఏ ఒక్కరి మీద చర్య తీసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు.

కేసీఆర్, రాహుల్ గాంధీ మధ్య ఒప్పందం కుదిరిందని కేంద్రమంత్రి ఆరోపించారు. అందుకే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అందరి ఫోన్లు ట్యాపింగ్ చేసి పౌరహక్కులు కాలరాసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. బీజేపీ కార్యాలయంలో క్లర్క్ ఫోన్ సైతం ట్యాపింగ్ చేశారంటూ విమర్శించారు. సిట్ నోటీసులు టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తద్వారా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయ దురహంకారం పెరిగిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. బీజేపీని చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు గెలిస్తే మాత్రం ట్యాక్స్‌లు పెరుగుతాయని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే మాత్రం.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి తీరాలని కేడర్‌కు ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి.. బీజేపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు.

# స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

(మొదటి పేజి తరువాయి)

అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

# ఆర్టీఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ అవగాహన సదస్సు




**ప్రజావినికిడి,(హైదరాబాద్):** ఆర్టీఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ ఎరుకల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్టీఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గుండ్ల నిఖిల్ రెడ్డి సహకారంతో చిక్కడపల్లి ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్టీఐ గురించి అవగాహన కల్పించడం జరిగింది.అలాగే విద్యార్థులకు ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు దాదాపు 150 మంది పిల్లలకు పుస్తకాలు పెన్సిల్లు పెన్నులు పంపిణీ చేయడం జరిగింది.ఎరకల మహేందర్ గౌడ్ విద్యార్థులతో మాట్లాడుతూ, విద్యార్థులు విద్యార్థినిలు బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగిన మంచి చెడుతోపాటు మనకు చదువు చెప్పిన గురువులను మన తల్లిదండ్రులని ఎలా అయితే పూజిస్తామో గౌరవిస్తామో మనకు చదువు చెప్పిన గురువులను కూడా అలాగే గౌరవించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎరుకల మహేందర్ గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తమ సంస్థ ముఖ్య ఉద్దేశం ఆర్టిఐ సమాచార హక్కు చట్టం (2005) ప్రతి సామాన్యుడి హక్కుకు ప్రతి ఒక్కరూ ప్రశ్నించే గుణం రావాలని అలాగే తమకు తమ తమ హక్కులను తెలుసు కోవాల్సిందిగా కోరారు.ఆర్టిఐ రక్షక్ ఉమన్ రైట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంతోమందికి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేయడం.చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేయడం. ఎండాకాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం ఇలాంటివే కాకుండా పేదవారికి తమ వంతు సహాయంగా ఎన్నో కార్యక్రమాలు చేసినట్టు తెలిపారు.ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ సదా శివుడి చేతుల మీదుగా ఆర్టీఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ క్యాలెండర్లను ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్టీఐ రక్షక్ హ్యూమన్ రైట్స్ సొసైటీ సభ్యులు విద్యార్థులు పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్ లో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి






**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
గత బీఆర్ఎస్ కేసీఆర్ పాలనలో అభివృద్ధి,సంక్షేమ పథకాలను నిరంతరం కొనసాగించిందని ఇప్పుడు పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ పాలనలో అన్ని పథకాలను ఎగవేస్తుందని, కేసీఆర్..రేవంత్ రెడ్డి పాలన మధ్యలో ఉన్న తేడాను గమనించి కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికలలో పలు వార్డులలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ ప్రచారలో బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డీసీపీ కార్యాలయం కోసం స్థల పరిశీలన..

**పరిశీలించిన డీసీపీ శిరీష..ఎసిపి లక్ష్మీ నారాయణ..సీఐ విజయ్ కుమార్..తహసిల్దార్ నాగయ్య..**



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రంగారెడ్డి షాద్ నగర్ పట్టణం ఫ్యూచర్ కమిషనరేట్ కు వెళ్ళడంతో షాద్ నగర్ జోన్ డీసీపీ గా శిరీష ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అయితే డీసీపీ కార్యాలయం ప్రస్తుతం ఎసిపి కార్యాలయంలో కొనసాగుతుండగా తాత్కాలింగ మిలీనియం టౌన్ షాప్ డీసీపీ కార్యాలయం రెడీ అవుతుంది. అయితే శాశ్వత భవన నిర్మాణం కోసం తహసిల్దార్ నాగయ్య తో కలిసి డీసీపీ శిరీష,ఎసిపి లక్ష్మీ నారాయణ,సీఐ విజయ్ కుమార్ లు కలిసి పట్టణంలోని సర్వే నంబర్ 179 లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ రెండు ఎకరాల స్థలం,ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అయితే స్థానికులు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ డీసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత సులభం అవుతుందని కోరుతున్నారు.

## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ



ఖమ్మం,ఫిబ్రవరి 4(ఆర్ఎన్ఎ): తెలంగాణ లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇప్పటికే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, రెండో జాబితా పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. త్వరలో రెండో విడత లబ్ధిదారుల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ ఈ విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఊరాజకీయాలను పక్కనపెట్టి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించే పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. మొత్తం 4 విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో ఆ మొత్తం నిధులు జమ చేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో పేదలు ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. మరికొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి.

# జాతీయ అధ్యక్షుడు నితిన్ నభీన్‌ని స్వాగతించిన రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి







**ప్రజావినికిడి,(షాద్ నగర్):**మొదటి సారి తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్ నగర్‌లో నిర్వహించిన విజయ సంకల్ప్ సభలో భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడు నితిన్ నభీన్ ని కలిసి స్వాగతించడం ఎంతో ఆనందంగా, గర్వంగా అనిపించింది.ఈ సభలో కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డిబీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు,పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకేఅరుణ,రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణ్,ఆశిష్ షెల్లార్,మహారాష్ట్ర మంత్రులు, ఎంఎల్సీలు, ఏవీఎన్ రెడ్డి, కొమరయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు గౌతమ్ రావు,అశోక్ కుమార్,ఉమ్మడి జిల్లా రాష్ట్ర నాయకులు ఆచారి నాగురావు,నమోజీకట్ట సుధాకర్ తదితర ప్రముఖులు పాల్గొని సభకు మరింత ప్రాధాన్యత తీసుకువచ్చారు.ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుండి కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై బీజేపీ పట్ల ఉన్న అపారమైన విశ్వాసం ఉత్సాహాన్ని మరోసారి చాటిచెప్పారు.
శ్రీ నితిన్ నభీన్ ప్రేరణాత్మక, ఉత్తేజభరిత ఉపన్యాసం కార్యకర్తల్లో కొత్త జోష్ నింపింది. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ విజయానికి ఈ సభ బలమైన సంకల్పంగా,చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది.

# ఆదర్శ మున్సిపాలిటే నా లక్ష్యం.

**-మీరు ఆదరించండి.. నేను అభివృద్ధి చేస్తా.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కదిలిన ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్యే,మాజీ జడ్పీటీసీలు, పార్టీ శ్రేణులు**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**మున్సిపల్ ఎన్నికల సమరంలో అధికార యంత్రాంగం కంటే రాజకీయ పార్టీల సందడి మిన్నంటింది. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది,ఒక ఆదర్శ మున్సిపాలిటీగా నిలబెట్టడమే తన ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని 2,16,17,18,19, 20 పలు కీలక వార్డుల్లో ఆయన విస్తృత పర్యటన చేస్తూ ఓటర్లను అభ్యర్థించారు. మీరు నన్ను ఆదరించి గెలిపించండి.. అద్భుతమైన అభివృద్ధితో మీ రుణం తీర్చుకుంటా అంటూ ప్రజలకు హామీ ఇచ్చారు.

### వార్డు వార్డునా జన నీరాజనం

మున్సిపాలిటీలోని 2,16,17,18,19, 20వ వార్డుల్లో ఎమ్మెల్యే తన ప్రచార పర్వాన్ని కొనసాగించారు. ఉదయం నుంచే ఆయా వార్డుల్లో పర్యటిస్తూ,ప్రతి ఇంటి గడపను తట్టారు. మహిళలు హారతులు పట్టి, పూలమాలలతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటూ, ఎన్నికల అనంతరం చేపట్టబోయే అభివృద్ధి పనుల ప్రణాళికను వివరించారు.
రంగంలోకి మాజీ ఎమ్మెల్యే,మాజీ జడ్పీటీసీలు,సీనియర్ నేతలు.. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ, తన అగ్ర నాయకత్వాన్ని రంగంలోకి దించింది.ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ లు శ్యామ్ సుందర్ రెడ్డి,వెంకట్ రాంరెడ్డి,సీనియర్ నేతలు, సర్పంచులు, తదితరులు భుజం భుజం కలిపి ప్రచారంలో పాల్గొనడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ అభ్యర్థుల గెలుపే ఏకైక లక్ష్యంగా వ్యూహాలు రచిస్తూ,కేడర్‌లో కొత్త జోష్ నింపారు.నాయకులందరూ ఐక్యంగా ప్రచారం నిర్వహిస్తుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ధీమా వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ స్థానిక మీడియా తో మాట్లాడుతూ, అధునాతన మౌలిక వసతులు కల్పించి,ప్రతి గల్లీలో సీసీ రోడ్లు, అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇస్తామని, మున్సిపల్ కార్యాలయంలో సామాన్యులకు ఇబ్బంది లేకుండా పారదర్శక సేవలు అందిస్తామన్నారు. పట్టణంలో పచ్చదనం పెంచేలా పార్కుల అభివృద్ధి,వీధి దీపాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గతంలో పట్టణ అభివృద్ధిని విస్మరించిన వారికి బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. అభివృద్ధి చేసే సత్తా ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరుతున్నాను అన్నారు.ఈ కార్యక్రమంలో 2వ వార్డు అభ్యర్థి బచ్చలి నరేష్, 16 వ వార్డు అభ్యర్థి వన్నాడ లావణ్య ప్రకాష్ గౌడ్,17వ వార్డు అభ్యర్థి నాజీయాబేగం సర్వర్ పాష,18వ వార్డు అభ్యర్థి సంతోషి బాయ్, 19వ వార్డు అభ్యర్థి అప్రిన్ బేగం షర్ఫుద్దీన్,20వ వార్డు అభ్యర్థి డాకన్న మనీష్ లు,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్,కాజా ఇద్రీస్,పార్టీ ముఖ్య నాయకులు కాశీనాథ్ రెడ్డి,చెంది తిరుపతిరెడ్డి, రఘు,జమ్రుద్ ఖాన్,ఇబ్రహీం, పురుషోత్తం రెడ్డి,ఫరక్ నగర్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,జితేందర్ రెడ్డి,అనుబంధ సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట

**సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్**

**అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం**

**ఉగాది రోజు గద్దర్ అవార్డుల ప్రదానం**

**మీడియాతో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్,**ఫిబ్రవరి4ప్రజావినికిడి,** తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి



హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు.సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుంచి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి, సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి, అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# డా.గౌస్ మోహియోద్దీన్ కు మోస్ట్ ఎమర్జింగ్ ఆంకాలజిస్ట్ అవార్డు ప్రధానం



**ప్రజావినికిడి, (హైదరాబాద్):** క్యాన్సర్ వ్యాధి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంపదించుకొని దాని నివారణ కొరకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ కన్స్యూమర్స్ డిస్ప్యూట్ రెడ్ సెల్ కమిషన్ అధ్యక్షురాలు, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి రాధా రాణి అన్నారు. బుధవారం ఖైరతాబాద్ లోని స్టేట్ కన్స్యూమర్ కార్యాలయంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన క్యాన్సర్ వ్యాధి అవగాహన శిబిరంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. క్యాన్సర్ గురించి అవగాహన పెంపొదించి దాని నివారణకు గుర్తింపును చికిత్స ప్రోత్సహించి సమాజంలో ప్రతి సంవత్సరం లక్షలాది జనాభా ఈ క్యాన్సర్ బారిన పడకుండా కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని దీనికి మనమందరం కలియుగ కలిసికట్టుగా పోరాడాలన్నారు.ప్రభుత్వ ఎం.ఎన్.జే ఇన్సిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గౌస్ మొహిద్దిన్ మాట్లాడుతూ మనదేశంలో 40 శాతం క్యాన్సర్ వస్తుందని పొగాకు సేవించడం వల్ల 14 రకాల క్యాన్సర్ కు కారణం అవుతుంది అన్నారు. పొగాకులో 800 రకాల క్యాన్సర్ కారకాలు ఉంటాయని పొగాకు పీల్చినప్పుడు ఆ రసాయనాలు ఊపిరితిత్తుల్లోకి చేరి ఊపిరితిత్తుల క్యాన్సర్ నోటి క్యాన్సర్ వస్తాయని ఉదాహరణలతో వివరించారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ,గత 30 సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధి నివారణ తీసుకోవలసిన జాగ్రత్తలపై ర్యాలీలు సదస్సులు ల ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు యువకులకు గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకు ఎన్నో అవగాహన శిబిరాలు నిర్వహించారని వివరించారు.ఈ సదస్సులో మాజీ అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ శ్రీ సిఎన్ సిఎల్ఎన్ గాంధీ కోఆర్డినేటర్లు జి. వేణుగోపాల్, బిచ్చు కారి ఆరెకటిక సూర్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# బడ్జెట్ లో మోసం చేసిన బీజేపీకి స్వాగతమా

**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్ లో నిధులు ఇవ్వడంలో విఫలం చేసిన బీజేపీ జాతీయ అధ్యక్షుడికి స్వాగతం పలుకడం సిగ్గు చేటని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బుర్ర రాము గౌడ్ విమర్శించారు. హైదరాబాద్ ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం గుండు సున్న నిధులు ఇస్తే అటువంటి వారికి స్వాగతాలు పలుకడడం రాష్ట్రానికి సిగ్గు చేటన్నారు. ప్రజలపై చేసిన ద్రోహానికి ముసుగే తప్ప మరేమీ లేదని ఎద్దేవ చేశారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా విస్మరించింది. తెలంగాణ నుంచి వేల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో వసూలు చేస్తూ, తిరిగి రాష్ట్రానికి రావాల్సిన నిధులను కావాలనే ఆపేస్తోందని విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ,కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ,




హైదరాబాదులో మెట్రో టు ఫేస్ కు 50 శాతం నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. రీజినర్ రింగ్రోడ్లకు, రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. ఐఐఎం,ఐటిఆర్ ఊసే లేదు. పాలమూరు ఎత్తిపోతల పథకం జాతీయ హోదా ఏమైందని ప్రశ్నించారు. తెలంగాణలో అతిపెద్ద పండగైనా సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదాను ఎందుకు కల్పించలేకపోయారన్నారు. జాతీయ నాయకులు ఎందుకు ఈ జాతరకి రాలేకపోయా నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదు. ఆదిలాబాద్ లో విమానాశ్రయం ఏమైంది.అలాగే సిమెంట్ ఫ్యాక్టరీకి నిధులు ఎక్కడికిపోయాయిప్రతి ఎన్నికల ముందు హామీలు, ఎన్నికలు ముగిసిన తర్వాత మౌనం ఇదే బిజెపి పాలనకు నిదర్శనం. తెలంగాణ ప్రజల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నకేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. బిజెపి నాయకులు జాతీయ అధ్యక్షుడికి పూలమాలలు వేసే ముందు తెలంగాణకు జరిగిన అన్యాయాలపై సమాధానం చెప్పాలి. లేకపోతే ఈ స్వాగతాలు ప్రజలకు చేసిన మోసాన్ని కప్పిపుచ్చే రాజకీయ డ్రామాగా చరిత్రలో నిలుస్తాయన్నారు. తెలంగాణ పై కేంద్ర ప్రభుత్వ వివక్షపై ఆమ్ ఆద్మీ పార్టీ నిరంతరం పోరాడుతుందని హెచ్చరించారు. వీరితో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు పరీక్షన్ రాజ్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కలిసిన సిరి హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
సిరి హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికయిన కార్యవర్గ సభ్యులను అభినందించారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు పలు సమస్యలు సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.దానిలో భాగంగా తమ స్వంత నిధులతో నిర్మించుకున్న కమ్యూనిటి హాల్ కొన్ని అసంపూర్తి పనులు మిగిలి ఉన్నాయని నిధుల కొరత కారణంగా కొన్ని పనులు మిగిలిపోవడం జరిగింది అని తెలిపారు.అలాగే కొన్ని సబ్ రోడ్ల నందు అసంపూర్తిగా ఉన్న డ్రైన్స్ పనులు పూర్తి చేసి నూతన సీ.సీ.రోడ్లు వేయాలని కోరారు.అలాగే గతంలో మీ యొక్క సహకారం వల్ల సీ.సీ.రోడ్లు నిర్మించుకోవడం జరిగింది అని గుర్తు చేశారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తప్పకుండా మీ యొక్క అభివృద్ధి పనులకు నా యొక్క సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.శివారు కాలనీల అభివృద్దే తన లక్ష్యం అని అన్నారు.మంచినీరు,డ్రైనేజీ, రోడ్లు తదితర సౌకర్యాల కల్పనే తన లక్ష్యం అని అన్నారు.అభివృద్ధి పనుల్లో భాగంగా అన్ని కాలనీవాసులు అందరు సహకరించాలని కోరారు.కమ్యూనిటి హాల్ నందు అసంపూర్తిగా




మిగిలిన పనుల్లో భాగంగా తన వంతు సహాయంగా యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి ఒక లక్ష రూపాయలు(1,00,000) తన వంతు సాయంగా కాలనీవాసులకు సుధీర్ రెడ్డి చేతులమీదుగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బాసరాజు వెంకన్న,ప్రధాన కార్యదర్శి ఆలె సుధాకర్ రెడ్డి,కోశాధికారి ప్రసాద్,గౌరవ అధ్యక్షులు రేగట్టే రాజిరెడ్డి, ఉపాదక్షులుగా కరుణాకర్, రవినాయక్, కార్యదర్శులుగా శ్రీనివాస్ రెడ్డి,మురళి,ఉప్పల సర్వేశ్వర చారి, సత్యనారాయణ, పార్క్ చైర్మన్ గా బాలరెడ్డి, విశ్వేశ్వర్, శేఖర్, కలీం తదితరులు పాల్గొన్నారు.

# సంజయ్ ఇకనైనా బుద్దిగా ఉండు

## కాంగ్రెస్ రాజకీయాలను వదులుకో ఎమ్మెల్యేకు జీవన్ రెడ్డి చురకలు

జగిత్యాల,**ఫిబ్రవరి4ప్రజావినికిడి,:** స్పీకర్ తీర్పుతో అయినా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఇక కాంగ్రెస్ జోలికి రాకుంటే మంచిదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం నాడు జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై శాసనసభ స్పీకర్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నా అని సంజయ్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నా. సంజయ్ నీకు



దొంగ బుద్ధి ఎందుకు?. స్పీకర్ తీర్పుతో పద్ధతిగా ఉండు. నా కాంగ్రెస్ పార్టీలో చిచ్చుపెట్టకు. నీ బీఆర్ఎస్ పార్టీలో నువ్వు కరెక్ట్‌గా ఉండు. నా పార్టీ అంతర్గత విషయాల్లో ఎందుకు వేలు పెడుతున్నావు?. అభివృద్ధి అంటే పక్కింట్లోకి కన్ను వేయడమా?. గడిచిన రెండు ఏళ్లలో సీఎం రేవంత్‌తో ఉండి నువ్వు చేసిన అభివృద్ధి ఏంటీ చెప్పు.. సంజయ్?' అని మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు ఏడాదిన్నర కాలంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనూ ఘాటుగా విమర్శించారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించినట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# క్యాన్సర్ ప్రొఫెసర్లకు ది బెస్ట్ ఆంకాలజిస్టు అవార్డు 2026 ప్రదానం



**ప్రజావినికిడి, (హైదరాబాద్):** క్యాన్సర్ నిర్మూలనతో పాటు వ్యాధి బారిన పడినవారిలో ఆత్మధైర్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి నరేష్ రెడ్డి తెలిపారు.తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నారాయణగూడ లోని రాజా బహదూర్ వెంకట్రామన్ రెడ్డి మహిళా కళాశాల ఆడిటోరియంలో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాన్సర్ వ్యాధిపై అవగాహన, నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రసంగించారు. ప్రతి ఏడుగురిలో ఒకరు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి ప్రొఫెసర్,హెచ్ఓడీ ప్రొఫెసర్ రఘు రామన్ మాట్లాడుతూ క్యాన్సర్ సాధారణ లక్షణాలు ఆకలి లేకపోవడం, అలసట, తలనొప్పి, హిమోగ్లోబిన్ తగ్గిపోవడం, ఈఎస్ఆర్ పెరగడం, బరువు తగ్గడం వంటి వాటిని ఉదాహరణలతో వివరించారు.ప్రభుత్వ ఎంఎన్‌జే ఆసుపత్రి సీనియర్ ప్రొఫెసర్ గాయత్రి పలాట్ మాట్లాడుతూ, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆకుకూరలు అధికంగా తీసుకోవాలని, ప్రతిరోజూ ధ్యానం, యోగా,నడక, వ్యాయామం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.అచ్యుతాదేవి,లయన్స్ రమాదేవి రెడ్డి,లయన్స్ ప్రేమ్‌చంద్ మునోత్ జైన్, ఉస్మానియా యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్ డాక్టర్ రవితేజ, సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ పాల్గొని ప్రసంగించారు.అనంతరం క్యాన్సర్ నివారణకు విశేషంగా కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన డాక్టర్లు ప్రొఫెసర్ ఆర్.రఘురామన్, ప్రొఫెసర్ గాయత్రి పలాట్,ప్రొఫెసర్ సదాశివులకు ది బెస్ట్ ఆంకాలజిస్టు అవార్డు2026ను ప్రశంసా పత్రం, శాలువా, మెమెంటో, పూలమాలతో ఘనంగా సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు.

# నిరుద్యోగులను మోసం చేయడం తగదు..

## హేమా సుదర్శన్ జిల్లోజు..



**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**నిరుద్యోగులను మోసం చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు అన్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగిన దర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొని హేమ సుదర్శన్ జిల్లోజు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్ వన్,గ్రూప్ టూ, గ్రూప్ త్రీ ,డీఎస్సీ, ఇంజనీర్ తదితర పోస్టులలో భర్తీ చేయడానికి నోటిఫికేషన్ లు విడుదల చేయకపోవడం చాలా అన్యాయం అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రతి సంవత్సరం ఉద్యోగ జాబ్ క్యాలెండర్ ను విడుదల జేస్తామని విద్యార్థి నిరుద్యోగులకు మాట ఇచ్చి ఇప్పుడు తీరా అధికారంలో వచ్చిన తర్వాత తాము ఇచ్చిన హామీలను విస్మరించడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ఆమె ప్రశ్నించింది. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఒకవైపు రాష్ట్రంలోని లక్షలాదిమంది నిరుద్యోగులు ఉద్యమిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రాజకీయ నిరుద్యోగులకు స్థానిక ఎన్నికలు, ఉప ఎన్నికలు అంటు వారికి రాజకీయ పదవులు కట్ట బెట్టడానికి, ఎన్నికల నోటిఫికేషన్ లు విడుదల చేస్తుందని ఎద్దేవా చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి తక్షణమే ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని,లేదంటే రాష్ట్ర పర్యటనకు వచ్చే రాహుల్ గాంధీ పర్యటనను అలాగే మున్సిపల్ ఎలక్షన్లో ప్రచారానికి వస్తున్న రేవంత్ రెడ్డి ని అడ్డుకుంటామని ఆమె హెచ్చరించారు.

# శ్రీ సిద్ధి వినాయక హిల్స్ కాలనీలో 1 9.00 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం.. కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సిద్ధి వినాయక హిల్స్ కాలనీలో 19.00 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్లును బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగిందిఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం కొరకు 19.00 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని అట్టి రోడ్లు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని దశలవారీగా కాలనీలోని ప్రతి అభివృద్ధి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుబ్బారావు యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ గీతారాణి,ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, కోశాధికారి సుధాకర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి ప్రసాద్, రామిరెడ్డి, సలహాదారులు కైలాస వతి, భాస్కర్, బ్రహ్మయ్య , కార్యవర్గ సభ్యులు సంపత్ కుమార్, వెంకటేశ్వరరావు, శ్రీకాంత్,భారతి మరియు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గంగం ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కృష్ణా జిల్లాలో దొంగనోట్ల ముద్రణ

## దొంగనోట్ల ముఠా అరెస్ట్



**మచిలీపట్నంఫిబ్రవరి4ప్రజావినికిడి,**
కృష్ణా జిల్లాలో దొంగనోట్లు ముద్రిస్తున్న ముఠాకు పోలీసులు చెక్ పెట్టారు. నిందితుల నుంచి సుమారు రూ.6 లక్షల నకిలీ నోట్లు, ప్రింటింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృత్తివెన్ను మండలం సంగముడిలోని ఓ వైన్ షాప్ వద్దకు వచ్చిన పలువురు దొంగనోట్లు ఇచ్చినట్లు నిర్వాహకులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వైన్ షాపు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు దొంగనోట్లు ముద్రిస్తున్న రంజిత్ సింగ్, బ్రహ్మ ఉమా శంకర్, దిలీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. పెందుర్తి మండలం కోకవణిపాలెంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని దొంగనోట్లు ముద్రిస్తున్నట్లు గుర్తించారు. రూ.30 వేలు అసలు కరెన్సీ ఇస్తే లక్ష రుపాయలు నకిలీ నోట్లు ఇస్తున్నట్లు విచారణలో తేలింది. సంక్రాంతి సందర్భంగా నకిలీ నోట్లు చెలమణిలోకి తీసుకొచ్చారని.. మిగిలిన వాటిని వైన్ షాప్‌లు, పెట్రోల్ బంకుల్లో మార్చేందుకు యత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి బంటుమిల్లి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. కృత్తివెన్ను మండలం సంగముడిలో నకిలీ నోట్ల చెలామణి చర్చనీయాంశంగా మారింది. సంగముడిలో ఓ మద్యం దుకాణం దగ్గరికి వెళ్లిన ఓ వ్యక్తి.. తనకు నచ్చిన బ్రాండ్ కొన్నాడు. అందు కోసం షాపు నిర్వాహకుడికి కొంత డబ్బు చెల్లించాడు. అయితే, అది ఫేక్ నోటు అని మద్యం షాపు నిర్వాహకులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు రంజిత్ సింగ్, బ్రహ్మ ఉమాశంకర్, దిలీప్ గా గుర్తించారు. వీరి నుంచి సుమారు రూ.6లక్షల విలువైన దొంగ నోట్లతోపాటు ప్రింటింగ్ మిషన్, పేపర్ స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఈ నకిలీ నోట్ల దందా వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సింగయ్య కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదు

## కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే వారికి జగన్ ప్రోత్సాహం

## రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి,ఫిబ్రవరి4ప్రజావినికిడి,**ప్రజాస్వామ్యానికి అర్థం తెలియని నాయకుడు జగన్ అని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దుయ్యబట్టారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే వారిని ఆయన ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. అంబటి రాంబాబు లాంటి వారితో జగనే మాట్లాడిస్తున్నారని స్పష్టమవుతోందన్నారు. తన కారు చక్రాల కింద నలిగి చనిపోయిన సింగయ్య కుటుంబ సభ్యుల్ని పరామర్శించేందుకు ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. రాష్ట్రంలో సుపరిపాలన చూసి తట్టుకోలేక, పెట్టుబడులు రావడాన్ని ఓర్వలేక దండయాత్రలకు జగన్ ఉసిగొల్పుతున్నారని మండిపడ్డారు. పేటీఎం బ్యాచ్‌కు ఉదయమే మద్యం తాగించి బైక్ లతో రోడ్లపై ప్రజల్ని భయపెడుతుంటే పోలీసులు ఎలా అనుమతిస్తున్నారని నిలదీశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్న మంత్రి అనగాని.. ఇకపై ఇలాంటి అనుమతులు ఇచ్చేటప్పుడు ప్రజా ప్రయోజనాలే ప్రధానంగా పోలీసులు వ్యవహరించాలని కోరారు. ప్రశాంతమైన గుంటూరు జిల్లాలో అరాచకాలు సృష్టించేలా జగన్ అనుచరుల ప్రవర్తన ఉందని విమర్శించారు. అసెంబ్లీలో చంద్రబాబు కంటతడికి కారకుడైన అంబటి పట్ల ఎవరికీ సదాభిప్రాయం లేదన్నారు. తాడేపల్లి నుంచి కాగితాలు పంపి అంబటి కుటుంబసభ్యులతో మాట్లాడిస్తూ.. రాష్ట్రంలో అలజడి సృష్టించాలనే జగన్ కుట్రలు సాగనివ్వమని మంత్రి అనగాని అన్నారు.

# పులి జాడలతో జనం బెంబేలు

## అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

**జనగామ,ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
పెద్దపులి సంచారం ఇప్పుడు మూడు జిల్లాల వాసులను భయాందోళనకు గురి చేస్తోంది. సిద్దిపేట, యాదాద్రి, జనగామ జిల్లాల సరిహద్దుల్లో తిరుగుతున్నట్లుగా గుర్తించారు. జనగామ మండలంలోని సిద్దెంకి, పెంబర్తి, పెద్దరాంచర్లలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యాద్రాది భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ మీదుగా పెద్దపులి జనగామకు ప్రవేశించినట్లు రైతులు ఆటవీశాఖ, పోలీసులు సమాచారం అందించారు. దీంతో ఆధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి పులి పాదముద్రలను సేకరించారు. వ్యవసాయ బావుల ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండోచ్చని కావున వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి వరుస గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా ఈ పులి యాదాద్రి భువనగిరి(జజీటజీటసతి ఃఠబీలజీనిజీణతిసతి) జిల్లా రాజపేట మండలం బసంతపూర్ సమీపంలో ఓ లేగదూడపై దాడి చేసి చంపేసినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, తాజాగా జనగామ జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామ పరిసరాల వైపు పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా గుర్తించారు. ఘటనా స్థలాల్లో అటవీ శాఖ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. పులి ప్రయాణించే మార్గాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి సంచారం కారణంగా సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# 15లక్షలు తీసుకుంటూ

## ఎసిబికి చిక్కిన కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఇ

హైదరాబాద్,**ఫిబ్రవరి4ప్రజావినికిడి,**: ఏసీబీ అధికారుల వలలో భారీ అవినీతి తిమింగలం పడింది. రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఈ చిన్నారెడ్డి అధికారులకు చిక్కారు. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. చిన్నారెడ్డి ఆస్తులు, ఇతర అంశాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. బిల్లులు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాలని ఒక కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు.



# మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా

# వెనుకబడిన వర్గాలు..

## కార్యాచరణ సిద్ధం చేయాలన్న సీఎం చంద్రబాబు

**ఆదరణ-3 ద్వారా కులవృత్తులకు ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు**

**రూ.60 కోట్ల సాస్కీ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం**

**బీసీ హాస్టళ్లలో మార్చిలోగా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం**

**6 జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్**




**అమరావతి,ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
వెనుకబడిన వర్గాలను (బీసీ) కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా (మైక్రో ఎంట్రప్రెన్యూర్లు), ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.
ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో 'ఆదరణ-3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.
విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.60 కోట్ల సాస్కీ నిధులతో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు.రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూరేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# వైసీపీ హిందూ ద్రోహి: నాగబాబు తీవ్ర వ్యాఖ్యలు

**వైసీపీని విమర్శిస్తూ వీడియో విడుదల చేసిన నాగబాబు**

**వేంకటేశ్వర స్వామిని సామాన్య భక్తులకు దూరం చేశారని మండిపాటు**

**అంతర్వేది, రామతీర్థం తదితన ఘటనలను ప్రస్తావించిన వైనం**



**అమరావతి,ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
వైసీపీ పార్టీ హిందూ ద్రోహి అంటూ జనసేన ఎమ్మెల్సీ నాగబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రామతీర్థం ధ్వంసం ఘటన, అంతర్వేది రథం దగ్ధం ఘటన, తిరుమల డిక్లరేషన్ తదితర అంశాలపై ఆయన స్పందిస్తూ వైసీపీపై మండిపడ్డారు. తిరుమలలో వసతి గృహాల ధరలు పెంచి... వేంకటేశ్వర స్వామిని సామాన్య భక్తులకు దూరం చేశారని విమర్శించారు. ఏ మాఫియాను కాపాడటానికి ఇదంతా చేశావు జగన్? అని ప్రశ్నించారు. హిందువులపై కుతంత్రాలు చేయడం తప్ప వైసీపీ నేతలకు మరొకటి లేదని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. అంతర్వేది ఘటనపై సీబీఐ విచారణ పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని నాగబాబు మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని ఆచరించే హిందువుగా తాను గర్వపడుతున్నానని చెప్పారు. వైసీపీ నేతలకు ఇతరుల వ్యక్తిగత జీవితాలపై ఉన్న ఆసక్తి... హిందూ దేవాలయాలపై లేదని విమర్శించారు. సినిమా రివ్యూలపై ఉన్న శ్రద్ధ... భగవంతుడిపై ఎందుకు లేదని ప్రశ్నించారు.
తిరుమల డిక్లరేషన్ ఇవ్వాలని అడిగితే అవమానకరంగా మాట్లాడారని నాగబాబు విమర్శించారు. పవన్ కల్యాణ్ భార్య, కూతురు తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చారని, దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా డిక్లరేషన్ ఇచ్చారని... అబ్దుల్ కలాం కంటే కూడా నీవు గొప్ప వ్యక్తివా? అని జగన్ పై మండిపడ్డారు. తిరుమల కొండతో పాటు ఇతర కొండలకు గుండు కొట్టాలని చూసింది నీవు కాదా? అని ప్రశ్నించారు.

# రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోంది

**అంబటి కుటుంబాన్ని పరామర్శించిన**

## మాజీ సిఎం జగన్



**గుంటూరు, ఫిబ్రవరి4ప్రజావినికిడి,**సీఎం చంద్రబాబు ఏడాదిన్నరగా కావాలనే ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టారని సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. తిరుమల లడ్డు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని రకరకాలుగా ప్రచారం చేశారని, చివరికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అసత్య ప్రచారం చేశారని అసహనం వ్యక్తం చేశారు. దేవుడంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా రాజకీయాలు చేశారని ఫైర్ అయ్యారు. అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజని మీద దాడులు చేశారని.. వారు చేసిన తప్పేంటి? అని ప్రశ్నించారు. ఇదే ప్రభుత్వం ఎప్పుడూ ఉండదని, వచ్చే మూడేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని వైఎస్ జగన్ అన్నారు. టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి.. ఆయన కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు.వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ? 'రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తుంది. భయానక వాతావరణంలో పాలన జరుగుతుంది. అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చూస్తే జంజిల్ రాజ్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. అంబటి, జోగి, కాకాణిలు చేసిన తప్పేంటి?. ప్రశ్నిస్తున్నారని మా వాళ్ళపై దాడులు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు కుట్ర పూరితంగా జంతువుల కొవ్వు అని తప్పుడు ప్రచారం చేసాడు. ఆవు, పంది, చేప కొవ్వు అంటూ ఉద్దేశ్య పూర్వకాలంగా దేవుడి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గారికి దేవుడంటే భయం భక్తి లేవు. దుర్మార్గంగా తప్పుడు ప్రచారం చేశారు. కేంద్ర ల్యాబ్లు ఎలాంటి జంతువుల కొవ్వు లేదని రిపోర్ట్ ఇచ్చాయి. సీబీఐ అదే విషయాన్ని సుప్రీం కోర్టుకి రిపోర్ట్ ఇచ్చింది. తప్పు చేసి ఉంటే వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి పేర్లు సీబీఐ ఎందుకు చేర్చలేదు. సీబీఐ వాళ్లకు క్లీన్ చిట్ ఇచ్చింది. అసలు సీబీఐ విచారణ కావాలని సుప్రీమ్ కోర్టును కోరిందే వైవీ సుబ్బారెడ్డి. చంద్రబాబు, లోకేష్, పవన్లు చెంపలేసుకుని క్షమాపణ కోరాలి. క్షమాపణ చెప్పకుండా మళ్లీ అదే దుర్మార్గపు అపార్థాలను ప్రచారం చేస్తున్నారు' అని ౯÷ర్ అయ్యారు.'సిగ్గు లేకుండా ప్లెక్సీలు వేయిస్తున్నారు. కుల మతాలను రెచ్చగొట్టే ప్లెక్సీలు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం కాదా. ఇలానే మేము సూపర్ సిక్స్ అమలు చెయ్యలేదని ప్లెక్సీలు వేస్తే ఒప్పుకుంటారా. ప్లెక్సీలు పెట్టి ప్రజల్లో బావోగ్వేదాలు రెచ్చగొట్టేలా చెయ్యడం తప్పు కాదా?. ఇలాంటి దుర్మార్గాలను ప్రశ్నిస్తే మా వాళ్ళపై దాడులు చేయిస్తారా?. సీఎం చంద్రబాబుకి మంచి బుద్ది ప్రసాదించాలని దేవుణ్ణి కోరి గుడి నుండి వస్తుంటే దాడులు చేసారు. అంబటి రాంబాబుని పోలీసుల సమక్షంలో కర్రలు పట్టుకుని కారుపై దాడికి పాల్పడ్డారు. కారులో ఉన్న రాంబాబుని దారుణమైన భూతులు తిడుతూ దాడి చేసారు. ఒక్కడే ఉండటం వల్ల అంబటి ఆగ్రహానికి గురయ్యారు. అలాంటి సమయంలో నోట్లో నుండి రెండు తిట్లు వచ్చాయి. ప్రాణం మీదకి వచ్చినప్పుడు వచ్చిన తిట్లే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా తిట్టలేదు. సంస్కారం ఉన్న వ్యక్తి కనుక ఆ మాటలు రావడంపై బాధపడి.. వివరణ ఇచ్చాడు. తిట్లు వచ్చినందుకు చింతిస్తూ వెనక్కి తీసుకున్నాడు. అలాంటి సంస్కారం ఉన్న అంబటిని చేతనైతే పొగడాలి.. కానీ దుర్మార్గంగా హత్య చెయ్యడానికి ప్రయత్నించారు. ఏకంగా 8 గంటల పాటు హత్యకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో పోలీసుల సమక్షంలో దాడి చేశారు. ఇంట్లో మహిళలను ఇష్టం వచ్చినట్లు తిడుతూ ఫర్నీచర్ పగలగొట్టారు. కార్లు ధ్వంసం చేసి.. ఆఫీస్ కి నిప్పు పెట్టారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఇలాంటి దాడులు జరిగేవా?. డీజీపీ ఆఫీస్ కూతవేటు దూరంలో ఉంది.. పక్కనే బెటాలియన్ ఉంది.. కంట్రోల్ చెయ్యలేరా?. అధికారులకు ఫోన్లు చేసినా ఒక్కరు ఎత్తలేదు.. పక్కా ఎ÷-లాన్ ప్రకారం హత్యాయత్నం చేసారు' అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# గాడితప్పతున్న పార్లమెంట్ సమావేశాలు

**అమరావతి,ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
పార్లమెంట్ సమావేశాలు గాడి తప్పాయి. సభలో చర్చలకు ఆస్కారం లేదు. రూల్స్ పాటించడం లేదు. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం రెండు పక్షాలు కూడా పంతాలకు పోతూ ప్రజాధనాన్ని, సమయాన్ని వృధా చేస్తున్నాయి. పోడియంలోకి దూసుకుని రావడం, అరవడం, కేకలు పెట్టటం సభనుంచి వెళ్లిపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో కాంగ్రెస్ చెప్పాలి. గత మూడు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. గతంలో లాగానే ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా ఇది కనిపిస్తోంది. సమస్యలను చర్చించడానికి ఉన్న పద్దతులను వదిలేసి కాంగ్రెస్ సభాస్తంభన అస్త్రాన్ని ఉపయోగించుకుంటోంది. కేవలం సభా కార్యక్రమాలకు అవరోధం లేదా, అంతరాయం కల్పించడం ద్వారా సభా కార్యక్రమాలు సాగకుండా చేస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో ఇదే పద్దతిని అవలంబించింది. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ, ఆ తరవాత బడ్జెట్‌పై చర్చలు ప్రధానంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఏదేని అంశాన్ని చర్చించే అవకాశం ఉంటుంది. కానీ కాంగ్రెస్ చర్చ కోరుకోవడం లేదు. కేవలం రచ్చనే కోరుకుంటోంది. దీంతో ప్రచారం వస్తుందన్న ధీమాలో ఉంది. ఇకపోతే ప్రధానంగా మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం ఆధారంగా చైనా సరిహద్దుల్లో పరిస్థితులు, అమెరికాతో ఒప్పందం పైనా చర్చించాలని రాహుల్ లేదా కాంగ్రెస్ కోరుకుం టోంది. అయితే దీనికి కొన్ని రూల్స్




ఉన్నాయి. ఈ మేరకు చర్చకు ప్రతిపాదించి, చర్చ చేయవచ్చు. ఇకపోతే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం ప్రకటన చేయకముందే కాంగ్రెస్ యాగీ చేస్తోంది. ఇంతకాలం ట్రేడ్ డీల్ జరగనందుకు మోడీపై దుమ్మెత్తి పోసారు. మన సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ట్రేడ్ డీల్ కుదరగానే అదేదో ద్రోహం జరిగినట్లుగా లేదా మోడీ అమెరికాకు అమ్ముడు పోయినట్లుగా ఆరోపిస్తున్నారు. పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటనకు సిద్దంగా ఉన్న సమయంలోనే సమావేశాల్లో రచ్చ చేయడం కాంగ్రెస్÷-కే చెల్లింది. అమెరికా -భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్సోషల్ మీడియాలో ప్రకటించటం, ఆ తరువాత మన ప్రధాని మోడీ అవునన్నట్టుగా ట్రంప్‌నకు ధన్యవాదాలు చెప్పుకోవటం జరిగింది. భారతదేశ ఆత్మగౌరవాన్ని, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉన్నదీ లేనిదీ చర్చిస్తే తెలుస్తుంది. ఏకపక్షంగా అదనపు సుంకాలు విధించటం దగ్గర నుంచి మన ఆర్థిక వ్యవస్థను అవహేళన చేయటం దాకా ట్రంపు సాగించిన బెదిరింపులపై భారత్ ఓపిక పట్టింది. యూరోపియన్ యూరియన్‌తో ఒప్పందం కుదరగానే ఇప్పుడు ట్రంప్ దిగివచ్చారు. అయితే దీనిని సానుకూలంగా చూడాల్సి విపక్షాలు ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమో సమాధానం చెప్పాల్సిందే! దేశ అవసరాలను బట్టి, అవకాశాలను బట్టి మనం వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం సాధారణ విసయం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఇదే చేస్తుంది. నిజానికి అహంకారపూరితంగా అమెరికా అధ్యక్షుడు బెదరింపు ధోరణితో వ్యవహరించారు. మన దేశం చౌకగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంటే- వద్దని అడ్డం పడ్డాది. మన దేశ రైతాంగాన్ని దారుణంగా దెబ్బ తీసేవిధంగా తన వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. మనం ఏయే దేశాలతో వాణిజ్య సంబంధాలను కలిగి ఉండాలో, కూడదో అదే నిర్దేశించాలని చూశారు. . ఇలాంటి తలబిరుసు పెత్తనానికి భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ తలవొంచకూడదని నిర్ణయించి, ఇంతకాలం ట్రేడ్ డీల్‌ను పక్కన పెట్టింది. పాకిస్తాన్-ఇండియా యుద్దాన్ని తానే ఆపానని ట్రంప్ అనేకసార్లు ప్రకటించుకున్నా, భారత్‌పై సుంకాలను భారీగా విధించినా, అక్రమ వలసల పేరిట భారతీయులకు సంకెళ్లు వేసి, దేశంలో దించిపోయినా- భారత్ ఓపిక పట్టింది. ఇప్పుడు కూడా ట్రంప్ ప్రకటించేదాకా ఒప్పందంపై మనం ముందుకు రాలేదు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికయ్యాక- తన దారిలోకి రాని దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించటం ఒక వ్యూహంగా ఎంచుకున్నాడు. కెనడా, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి మిత్రదేశాలపైనా, రష్యా, చైనా వంటి పోటీ దేశాలపైనా విరుచుకుపడ్డాడు. సుంకాల విధింపుతో ఆయా దేశాల వాణిజ్యానికి తాత్కాలికంగా నష్టం కలిగించారు. అయితే ధరలు పెరిగి అమెరికా పౌరులకు కూడా అంతే సమస్య ఎదురవుతుంది. దీంతో, ట్రంప్ దూకుడుకు వ్యతిరేకంగా అమెరికాలోనూ పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. సుంకాలు ఎదుర్కొన్న అనేక దేశాలు సైతం అదే పద్ధతిలో సమాధానం చెప్పాయి. నీకు మేమంత దూరమో మాకు నువ్వూ అంతే దూరం అని సమాధానం ఇచ్చాయి. భారత్ కూడా అదే పద్దతిని అవలంబించింది. మోడీ ప్రభుత్వం ఏ మాత్రం లొంగుబాటుకు ఒప్పుకోలేదు. మనపట్ల అమెరికాలోనే సానుకూలత వ్యక్తం అయ్యింది. అమెరికాలో ఒత్తిడి తట్టుకోలేక ట్రంప్ భారత్‌తో ఓ రకంగా కాల్ళ బేరానికి వచ్చాడని చెప్పుకోవాలి. అంతేగానీ భారత్ పరువు పోయిందని, మోడీ లొంగిపోయాడని విమర్శించే వారికి అంతర్జాతీయ వ్యవహారాలు తెలియవను కోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ముందున్నారు. ట్రంప్ బెదరింపులకు లొగివుంటే ఎప్పుడో ఒప్పందం ఖరారు అయ్యేది. అయితే ఇవన్నీ చర్చించాల్సిన అంశాలే. కాదని ఎవరూ అనడం లేదు. పార్లమెంటులో చర్చకు ముందే గలాభా సృష్టించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ పైత్యాన్ని చాటుకుంది. మోడీ ప్రకటన చేసే వరకు ఆగాలి. తాము కోరుకున్నట్లు ఇప్పుడే..ఈ క్షణమే చర్చ జరగాలని అనుకోవడం దుర్మార్గం తప్ప మరోటి కాదు.
పార్లమెంటులో సమస్యలపై చర్చించకుండా, జారుకోవడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి.

# మరణశాసనం రాసిన కొరియన్ గేమ్

### ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ఆత్మహత్య -యూపిలో ముగ్గరు అక్కాచెల్లెళ్ల బలవన్మరణం

**లక్నో,ఫిబ్రవరి4ప్రజావినికిడి,**
ఉత్తర ప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్ ముగ్గరు అక్కాచెల్లెళ్ల ప్రాణం తీసింది. ఆన్‌లైన్ గేమ్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించటంతో ముగ్గరు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఘజియాబాద్‌కు చెందిన 16 ఏళ్ల నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అన్ని పనులు కలిసే చేసేవారు. కోవిడ్ సమయంలో ముగ్గరు అక్కాచెల్లెళ్లు టాస్క్ బేస్డ్ కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. గంటలు, గంటలు గేమ్ ఆడుతూ గడిపేవారు. అంతేకాదు.. తమ పేర్లు మార్చుకుని కొరియన్ పేర్లు పెట్టుకున్నారు. గేమ్ అడిక్షన్ కారణంగా స్కూలుకు కూడా సరిగా వెళ్లేవారు కాదు. పిల్లలు పూర్తిగా గేమ్‌కు బానిసలుగా మారటంతో తల్లిదండ్రులకు కోపం వచ్చింది. వారిని ఇకపై గేమ్ ఆడవద్దని మందలించారు. దీంతో ముగ్గురూ మనస్తాపానికి గురయ్యారు. గేమ్ ఆడకుండా బతకలేమని భావించారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురూ కలిసి చనిపోవాలని నిశ్చయించుకున్నారు. మంగళవారం 8 పేజీల సూసైడ్ నోట్ రాశారు. రాత్రి 2.30 గంటల



ప్రాంతంలో 9వ అంతస్తులో ఉన్న తమ ఎ÷-లాట్ కిటికీ నుంచి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. బిల్డింగ్ దగ్గర పెద్ద శబ్దం రావటంతో స్థానికులు అక్కడికి వచ్చారు. నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న వారిని చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గరిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మాస్ సూసైడ్స్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కాచె÷-లలెళ్ల గదిలోకి వెళ్లి పరిశీలించగా అక్కడ సూసైడ్ నోట్ దొరికింది. ఆ సూసైడ్ నోట్‌లో వారు తమ బాధనంతా వివరంగా రాసుకొచ్చారు. తల్లిదండ్రులకు క్షమాపణ సైతం చెప్పారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఏం తేలిదంటే.. ప్రాచీ విపరీతంగా మొబైల్ ఫోన్ వాడేది. ఆమె కారణంగానే మిగిలిన ఇద్దరూ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. చివరకు గేమ్ అడిక్షన్ కారణంగానే ముగ్గరూ ప్రాణాలు కోల్పోయారు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము

### కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి4ప్రజావినికిడి,**



మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్ధవంతంగా నిర్వహించారు.
---------------

# జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఇంజనీర్ మృతి

**విశాఖపట్టణంఫిబ్రవరి4ప్రజావినికిడి,** జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కిందపడి చీఫ్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం విశాఖ జిల్లా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఓ ప్రైవేటు కంపెనీలో చీఫ్ ఇంజనీర్ గా పని చేస్తున్న హర్షవర్ధన్ (36) విజయవాడ వైపు వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా హర్షవర్ధన్ బుధవారం ఉదయం సూసైడ్ నోట్ రాసి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఆయన అదృశ్యమైనట్లు న్యూపోర్టు పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్లో హర్షవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. చీఫ్ ఇంజనీర్ ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణంగా తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

### ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి

### అవగాహన కోసం షార్ట్‌ఫిల్మ్‌లు తీస్తా

### క్యాన్సర్ దినోత్సవంలో చిరంజీవి

**హైదరాబాద్,ఫిబ్రవరి4ప్రజావినికిడి,** క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలని అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు.శరీరంలో వచ్చే మార్పులు గమనించాలని.. నిర్లక్ష్యం చేయకూడదని చిరంజీవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలని చిరంజీవి అన్నారు. భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు. అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి.





# తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..

### ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

### 2020-24 మధ్య కాలంలో ఎయిడ్స్ కారణంగా దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది మృతి

### ఏపీలో 32,642 మంది... తెలంగాణలో 11,498 మంది మృతి

### విదేశీ తరహా జీవనశైలి వల్ల ఐటీ రంగంలో విస్తరిస్తున్న వైరస్

**ఫిబ్రవరి4ప్రజావినికిడి,**



ఏపీ, తెలంగాణల్లో ఎయిడ్స్ మరణాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. గత ఐదేళ్లలో హెచ్ఐవీ బారిన పడి మరణించిన వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం... 2020-2024 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్ఐవీ కారణంగా చనిపోయారు. వీరిలో తెలుగు రాష్ట్రాల్లో మరణించిన వారి సంఖ్య 44,140గా ఉంది. ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఐటీ రంగంలో హెచ్ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థ వెల్లడించింది. విదేశీ తరహా జీవనశైలికి అలవాటు పడటం ఐటీ రంగంలో హెఐవీ వ్యాప్తి కావడానికి కారణమవుతోందని తెలిపింది. ఈ రంగంలో హెచ్ఐవీ పరీక్షల సంఖ్యలను పెంచాల్సి ఉందని సూచించింది.



# వయసు కేవలం సంఖ్య మాత్రమే....

**- ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలి**
**- టీమిండియా మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ**

తదుపరి ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027లో టీమిండియా మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా అనే ప్రశ్నకు దిగ్గజ సారథి మహేంద్ర సింగ్ ధోనీ ఆసక్తికర సమాధానం చెప్పాడు. ఫిట్‌నెస్, ఫామ్ ఉంటే వయసుతో సంబంధం లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగవచ్చని అభిప్రాయపడ్డాడు.వయసు కేవలం సంఖ్య మాత్రమేనని, 35 ఏళ్ల వ్యక్తి 22 ఏళ్ల కుర్రాడి కంటే ఫిట్‌గా ఉంటే అతనే జట్టుకు అర్హుడని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా ఫిట్‌గా ఉండి, ఫామ్‌లో ఉంటే వన్డే ప్రపంచకప్ 2027 ఆడుతారని బదులిచ్చాడు. వయసును కాకుండా ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు పరోక్షంగా చురకలంటించాడు. 'రోహిత్, కోహ్లీ వన్డే ప్రపంచకప్ 2027లో ఎందుకు ఆడకూడదు నా దృష్టిలో వయసు కొలమానం కాదు. ప్రదర్శన, ఫిట్‌నెస్ మాత్రమే జట్టులో కొనసాగాలా వద్దా అనేదానికి ప్రమాణాలు. అందుకే ఎవరికీ ఎమి చెప్పాల్సిన అవసరం లేదని నేను భావిస్తాను. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా ఉండాలి. జట్టులో అందరినీ ఒకేలా చూడాలి. నేను అరంగేట్రం చేసినప్పుడు నాకు 24 ఏళ్లు. ఆ సమయంలో ఎవరూ వచ్చి నాకు ఏం చెప్పలేదు. కాబట్టి ఇప్పుడు నేను భారత్ తరపున ఏడాది ఆడినా... మరో పదేళ్లు, 20 ఏళ్లు ఆడినా.. నా వయసు గుర్తు చేయాల్సిన అవసరం లేదు.వయసు ఏమాత్రం కొలమానం కాదు. ఫిట్‌నెస్ అత్యంత ముఖ్యం. 22 ఏళ్ల కుర్రాడు కూడా ఫిట్‌గా లేకపోతే జట్టుకు అనవసరం. విరాట్ కోహ్లీ లేదా భవిష్యత్తులో వచ్చే ఇతర ఆటగాళ్ల గురించి మాట్లాడితే.. ఒకరికి 30 ఏళ్లు దాటాయి కాబట్టి వారు తదుపరి ప్రపంచకప్ ఆడగలరా లేదా అనే నిర్ణయించాల్సింది మనం కాదు. అది వారి వ్యక్తిగత నిర్ణయం. వారు ఫిట్‌గా ఉండి నిలకడగా రాణిస్తూ.. దేశంలో కోసం ఆడాలనే పట్టుదలతో ఉంటే.. వారిని ఎందుకు పక్కనపెట్టాలి. అనుభవం కలిగిన ఆటగాళ్లు ఎలా వస్తారు సచిన్ టెండూల్కర్ మినహా ఎవరూ 20 ఏళ్ల వయసులోనే అనుభవం సంపాదించలేదు. సచిన్‌లా 16-17 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ ఆడినవారు చాలా తక్కువ. అంతర్జాతీయ క్రికెట్ చాలా భిన్నమైనది. ప్రస్తుతం అనుభవం కలిగిన ఆటగాళ్లు కావాలంటే 30-33 ఏళ్ల వయసున్న వారు కావాలి. కానీ మనం 20, 25 మ్యాచ్‌లు ఆడిన వారిని అనుభవం కలిగిన ఆటగాళ్లుగా చూస్తున్నాం. ఒత్తిడిలో ఆడితేనే నిజమైన అనుభవం వస్తుంది. కేవలం మ్యాచ్‌ల సంఖ్యతో కాదు.ముఖ్యంగా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేవారు, డెత్ ఓవర్లలో బౌలింగ్ చేసేవారికి అనుభవం చాలా ముఖ్యం. ఉత్కంఠగా సాగే మ్యాచ్‌లు ముగింపుకు వచ్చినప్పుడు వారి అనుభవం కీలక పాత్ర పోషిస్తుంది. ఒక బౌలర్‌గా నేను 10-20 సార్లు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కోవాలంటే, కనీసం నేను 80-85 మ్యాచ్‌లు ఆడాలి.

## వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపాడు. అండర్ 19 ప్రపంచకప్ 2026లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన సెమీఫైనల్లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. 311 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. 33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సలతో 68 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. క్రీజులో ఉన్నంత సేపు అఫ్గాన్ బౌలర్లకు చెమటలు పట్టించాడు.ఎదుర్కొన్న 33 బంతుల్లోనే క్రికెట్‌లో ఉన్న షాట్స్ అన్ని ఆడాడు. తన ట్రేడ్ మార్క్ పుల్ షాట్‌తో పాటు ఫ్లిక్, కవర్ డ్రైవ్, ఆన్ డ్రైవ్‌లతో బౌండరీలు రాబట్టాడు. అతను కొట్టిన నాలుగు సిక్సలు ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాయి. 22 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతను ఇచ్చిన సునాయస క్యాచ్‌ను అఫ్గాన్ ఫీల్డర్ ఉజైరుల్లా నియాజై వదిలేసాడు. ఈ అవకాశంతో చెలరేగిన అతను 24 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సలతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.అనంతరం మరో రెండు బౌండరీలు, సిక్స్ బాదిన సూర్యవంశీ.. పుల్ షాట్ ఆడబోయి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తన ప్రధాన బలమైన పుల్ షాట్ కొన్ని సార్లు అతనికి బలహీనతగా మారుతుంది. పాకిస్థాన్‌తో జరిగిన గత సూపర్ సిక్స్ మ్యాచ్‌లో సూర్యవంశీ పుల్ షాట్ ఆడబోయే వికెట్ పారేసు కున్నాడు. ఈ మ్యాచ్‌లోనూ అదే తరహాలో వెనుదిరిగాడు.



# డబ్ల్యూపీఎల్ ఫైనల్ చేరిన దిల్లీ క్యాపిటల్స్



డబ్ల్యూపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్ మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. వడోదర వేదికగా గుజరాత్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 169 పరుగుల లక్ష్యాన్ని దిల్లీ 15.4 ఓవర్లలో ఛేదించి వరుసగా నాలుగోసారి ఫైనల్‌కు చేరింది. దిల్లీ గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది.టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది గుజరాత్‌ను జెయింట్స్. 7 వికెట్ల కోల్పోయి 168 పరుగులు చేసింది. దిల్లీ బౌలర్లు అంతకుముందు గుజరాత్ జెయింట్స్‌కు కళ్లెం వేశారు. ఓపెనర్ బెత్ మూనీ నిలవడంతో జెయింట్స్ పోటీ ఇచ్చే స్కోరు చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను బౌలర్లు ఒత్తిడికి గురిచేశారు. ఆరంభలోనే గుజరాత్‌కు పెద్ద షాక్ తగిలింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ సోఫీ డివైన్‌ను పెవిలియన్‌కు చేర్చింది షినెలి హెన్రీ. దీంతో సోఫీ ఆరు పరుగులకే వెనుదిరిగింది. జాగ్రత్తగా ఆడుతున్న మూనీకి తోడుగా అనుష్క శర్మ నిలిచింది. కానీ అది ఎక్కువ సేపు నిలవలేదు. ఆరో ఓవర్లో అనుష్క, ఆష్లీ గార్డ్‌నర్‌లను నందని శర్మ వరుస బంతుల్లో పెవిలియన్‌కు చేర్చింది. 9వ ఓవర్లో కనికను మిన్ను మణి వెనక్కి పంపింది. దీంతో 9 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 60 పరుగులే చేయగలిగింది గుజరాత్.అయితే వికెట్లు పోతున్నా మూనీ మాత్రం గ్రీజులో నిలిచింది. కానీ దిల్లీ బౌలర్ల కట్టడికి ధీటుగా ఆడలేకపోయింది. ఆమెకు ఎట్టకేలకు వేర్‌హామ్ జోడి కుదరింది. దీంతో ఎదురుదాడికి దిగిన వేర్‌హామ్ మూడు ఫోర్లు, ఓ సిక్స్‌తో ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చింది. కానీ గుజరాత్ ఇన్నింగ్స్ జోరందుకుంటున్న సమయంలో వేర్‌హామ్‌ను షినెలి ఔట్ చేసింది. అయిదో వికెట్ భాగస్వామ్యానికి 61 పరుగుల వద్ద తెరపడింది. 17వ ఓవర్లో వేర్‌హామ్ వెనుదిరిగే సమయానికి గుజరాత్ స్కోరు 120. వెంటనే ఫుల్మాలి కూడా ఔట్ అయ్యింది.

## అండర్-19 వన్డే ప్రపంచకప్
# ఫైనల్‌కు భారత్

**- అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం**

అండర్-19 వన్డే ప్రపంచ కప్‌లో భారత్ వరుస విజయాలతో అదరగొడుతోంది. బుధవారం జరిగిన సెమీఫైనల్ పోరులో అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితమైన ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 41.1 ఓవర్లలోనే ఛేదించింది.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115; 104 బంతుల్లో) సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (68; 33 బంతుల్లో) అఫ్గాన్ బౌలర్లపై విరుచుకుపడి ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (62) బాధ్యతాయుతంగా ఆడి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. చివర్లో విహాన్ మల్హోత్రా (38 నాటౌట్) విన్నింగ్ షాట్ కొట్టి మ్యాచ్‌ను పూర్తి చేశాడు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులతో భారీ స్కోర్ చేసింది. ఫైజల్ షినోజాదా (110), ఉజైరుల్లా (101 నాటౌట్) అద్భుత శతకాలతో భారత బౌలర్లను ఆడుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు భారీ స్కోరు అందించారు. ఉస్మాన్ సాదత్ (39), ఖలీద్ అహ్మద్జాయ్ (31) కూడా బాగానే ఆడారు. అఫ్గాన్ చివరి 10 ఓవర్లలో ఏకంగా 111 పరుగులు చేయడం గమనార్హం. భారత బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు తీశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్‌కు ఓపెనర్లు ఉస్మాన్ సదత్(39), ఖలిద్ అహ్మద్‌జాయ్(31) శుభారంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఈ జోడిని దీపేష్ దేవంద్రన్ విడదీసాడు. ఖలిద్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరో ఓపెనర్ ఉస్మాన్‌తో కలిసి ఫైసల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. హాఫ్ సెంచరీకి చేరువైన ఉస్మాన్‌ను కాన్షిక్ చౌహన్ ఔట్ చేశాడు. దాంతో క్రీజులోకి ఉజైరుల్లా నియాజై రాగా.. ఇద్దరూ కలిసి భారత బౌలర్లను చెడుగుడు ఆడారు.ఈ క్రమంలో 55 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన ఫైసల్.. అనంతరం మరింత దూకుడుగా ఆడి మరో 31 బంతుల వ్యవధిలోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కాస్త నిదానంగా ఆడిన ఉజైరుల్లా నియాజై 63 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు.



## వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఊచకోత

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ దుమ్మురేపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో సౌతాఫ్రికాతో ముంబై వేదికగా జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 20 బంతుల్లోనే 53 రన్స్ చేశాడు.న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన ఇషాన్ కిషన్ అదే జోరును కొనసాగించాడు. ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని వామప్ మ్యాచ్‌లో సత్తా చాటాడు. సహచర ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఒకే ఓవర్లో 29 పరుగులు చేశాడు.అన్రిచ్ నోకియా వేసిన ఐదో ఓవర్ తొలి బంతికి అభిషేక్ సిక్స్ కొట్టి రెండో బంతికి సింగిల్ తీసుకున్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ వరుసగా 6, 6, 4, 6 బాదాడు. 7 సిక్సులు, 2 ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని రిటైర్డ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ టీమిండియా ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని ఈ మ్యాచ్ ద్వారా టీమ్



# పాకిస్థాన్ నీచపు బుద్దే అంత!!

**- టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్**



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ నీచపు బుద్దే ఈ వివాదానికి కారణమని తెలిపాడు. నాలుగు రోజుల్లో పాక్ దారికొస్తుందని అభిప్రాయపడ్డాడు. కచ్చితంగా భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందని, ఆ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు.భద్రతా కారణాల నేపథ్యంలో భారత్‌లో పర్యటించలేమని, తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. దాంతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకోగా.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది. అయితే ఈ నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తప్పుబట్టింది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది.తాజాగా ఈ వ్యవహారంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. పాకిస్థాన్ తీరును తప్పుబట్టాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అవతార్ లెవల్లో వారణాసి మూవీ

**పదిహేనేళ్ల క్రితం ప్లాన్ చేస్తే ఇప్పుడు కుదరింది**

**ఈ సినిమాలో రాముడిగా మహేశ్ బాబు కనిపిస్తారు**

**అత్యద్భుత దృశ్యకావ్యంగా మూవీని విడుదల చేస్తున్నాం**

**అంతర్జాతీయ మీడియాతో రాజమౌళి, మహేశ్ బాబు**



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా మహేశ్‌బాబు కనిపించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు. నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పాని ప్రియాంక అన్నారు. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు విశేషాలు తెలిపారు. 15 ఏళ్ల కిత్రమే రాజమౌళి దర్శకత్వంలో చేయాల్సిఉంది. ఇప్పటికి అది కుదిరింది. 'ఆర్‌ఆర్‌ఆర్' పూర్తయిన తర్వాత ఏడాది పాటు దీని స్క్రిప్ట్ గురించి ఆలోచించారు. నన్ను ఆఫీసుకు పిలిచి 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టిందని మహేశ్ బాబు అన్నారు. 'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం.. ఆయనకు ప్రత్యేకమైన భంగిమ ఉంటుంది. నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2,3 నెలలు దానికోసమే కష్టపడ్డాం. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. ఆయనకు సినిమాపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో చెప్పడానికి ఈ ఒక్క విషయం చాలు. ఈ సినిమా భారీస్థాయిలో విడుదలవుతుంది. 'వారణాసి' లో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను ఎంపిక చేయడం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఈ సినిమాలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత విభిన్నమైన, అంచనా వేయలేని పాత్ర అని ఆయన తెలిపారు. ఈ కుంభ క్యారెక్టర్ పూర్తిగా గ్రే షేడ్స్‌తో సాగుతుందని చెప్పారు. ఎప్పుడు ఏం చేస్తాడో ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఈ పాత్రను డిజైన్ చేసినట్లు వెల్లడించారు. తన నిజజీవితానికి పూర్తిగా భిన్నమైన డార్క్ రోల్ కావడం వల్ల ఇది తనకు పెద్ద ఛాలెంజ్‌గా మారిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వీల్‌చైర్, 'డాక్టర్ ఆక్టోపస్' తరహాలో రోబోటిక్ చేతులు వంటి ఎలిమెంట్స్‌తో పృథ్వీరాజ్ లుక్ భయానకంగా ఉండనుందని సమాచారం. కేవలం కళ్లతోనే భయపెట్టే విధంగా ఈ పాత్రను డిజైన్ చేశారనే ప్రచారం జరుగుతోంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు చూడని సైకలాజికల్ విలన్‌గా 'కుంభ' నిలుస్తాడని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి 'వారణాసి'లో హీరో మహేష్ బాబు పోషిస్తున్న 'రుద్ర' పాత్రకు సమానంగా నిలిచే 'కుంభ' విలన్ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశముంది.





## తక్షకుడిగా వస్తున్న ఆనంద్ దేవరకొండ

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ 'తక్షకుడు'. గతంలో 'మిడిల్ క్లాస్ మెలోడీస్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని అందించిన దర్శకుడు వినోద్ అనంతోజు, ఆనంద్ దేవరకొండ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా టీజర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. టీజర్ చూస్తుంటే ఇది పక్కా రివెంజ్ డ్రామాగా కనిపిస్తోంది. పెళ్లయిన రోజే తన కుటుంబాన్ని కోల్పోయి, తీవ్ర గాయాలతో అడవిలో పడి ఉన్న యువకుడిని స్థానికులు కాపాడటం, ఆ తర్వాత తన పతనానికి కారణమైన వారిపై అతను తీర్చుకునే ప్రతీకారమే ఈ చిత్ర కథాంశమని అర్థమవుతోంది. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా చాలా ఇంటెన్స్ మరియు సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. ఇక 'లాపతా లేడీస్' ఫేమ్ నితాన్షీ గోయల్ ఈ చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, కాలకేయ ప్రభాకర్ కీలకమైన నెగటివ్ రోల్‌లో నటిస్తున్నారు. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగుతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది.

# ఏప్రిల్ 30న పెద్ది

### కొత్త రిలీజ్ డేట్ ప్రకటన




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర దర్శకుడు బుచ్చి బాబు సానా అధికారికంగా ప్రకటించారు. వాస్తవానికి ఈ చిత్రాన్నిమార్చి 27న విడుదల చేయాలని భావించారు. పవన్ కల్యాణ్ కొత్త చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26న వస్తున్నట్టు ఇవాళ ప్రకటించిన నేపథ్యంలో, 'పెద్ది' విడుదల తేదీని వెనక్కి జరిపినట్టు తెలుస్తోంది. అయితే, కొత్త విడుదల తేదీ మే డే వీకెండ్‌తో కలిసి వస్తుండటంతో సమ్మర్ సీజన్‌లో సినిమాకు ఇది బాగా కలిసొస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. "అతడి రాక తేదీ మారుతుంది, కానీ అతడి దృఢ సంకల్పం మారదు" అంటూ చిత్రబృందం చేసిన ప్రకటన అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. గ్రామీణ క్రీడా నేపథ్యంతో కూడిన యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ టైటిల్ రోల్‌లో కనిపించనున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ. ఆర్. రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.

## చిరుమూవీలో సారా అర్జున్ ?

మన శంకర వరప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.



## బైకర్‌లో రాజశేఖర్ పవర్‌ఫుల్ రోల్




ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బు÷-లలెట్ సునీల్' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది. గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. 'ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది' అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర్' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి.

## 2026 మార్చి 26న 'ఉస్తాద్ భగత్ సింగ్'




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ కాంబోలో సినిమా వస్తుండటంతో అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా విడుదల తేదీని ప్రకటించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో పవన్ సరసన టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించనుంది. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వేసవి సీజన్‌ను టార్గెట్ చేస్తూ విడుదల తేదీని ప్రకటించడంతో పవర్ స్టార్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. చఖదీూాఅమీుతీఎష్ట్ర2౯ష్ట్ర అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఈ వార్తను ట్రెండ్ చేస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613